క్లుప్తంగా

ప్యూరిఫైయర్, టీవీ అందజేత



టీవీ, ప్యూరిఫైయర్ అందిస్తున్న మాజీ సర్పంచ్ వడ్డి రాజేందర్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని ధని ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వడ్డి రాజేందర్‌రెడ్డి, ఆయన మేనకోడలు ఎన్‌ఆర్‌ఐ అరుణ్‌జ్యోతి శనివారం 55 ఇంచుల టీవీ, వాటర్ ప్యూరిఫైయర్‌లు అందజేశారు. ఉపాధ్యాయులకు కుర్చీలు, తదితర సామగ్రిని సమకూర్చారు. గ్రామానికి తనవంతుగా సహకారం అందించాలన్న లక్ష్యంతో రూ.70 వేలు వెచ్చించి వీటిని సమకూర్చామని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హెచ్‌ఎం గంగాధర్, స్థానిక సర్పంచ్ లక్ష్మీ చిన్నయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు కరిపె విలాస్, నాయకులు గంగారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ భోజన్న, గ్రామస్తులు ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



బాబుసింగ్‌తో ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పౌరదేవి పీఠాధిపతి బాబుసింగ్ మహారాజ్ అన్నారు. మండలంలోని కుంసర గ్రామంలో శనివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావుపటేల్ బాబుసింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, నాయకులు సోలంకిభీంరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



కుంటాల: మండలకేంద్రంలో గురుస్వామి జక్కని గజేందర్ నివాసంలో శనివారం అయ్యప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి చిత్రపటాలను అందంగా అలంకరించారు. హరిహరసుతునికి పంచామృతంతో అభిషేకం చేశారు. గురుస్వామి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. పాల్గొన్న భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాములు సిర్యార్ రాజేశ్వర్, ఉదయ్‌కుమార్, హరిప్రసాద్, బాలాజీ, నటరాజ్, పెద్ది కాపు మల్లేశ్, జక్కని రవితేజ, చిప్ప సంజీవ్, గంగాభూషణ్, బోనగిరి రామకృష్ణ పాల్గొన్నారు.

సోన్ పాఠశాలలో బాలసభ



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సోన్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేశారు. తెలుగు ఉపాధ్యాయులు నాగయ్య కుర్మే, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేశ్వర్, హెచ్‌ఎం ఆరాధన పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి'

కడెం: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలను వెంటనే చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను త్వరగా చేపట్టాలన్నారు. 317 జీవో విషయంలోవిచారణ జరిపించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్, స్వీపర్ పోస్టులు పునరుద్ధరించాలని కోరారు.

అన్నదానం

తానూరు: మండలంలోని బోల్సాకు చెందిన యాచకుడు ముక్కోల గంగన్న శనివారం మొగ్లి గ్రామంలోని మహాలక్ష్మి ఆలయంలో అన్నదానం నిర్వహించాడు. భిక్షాటన చేసి వచ్చిన డబ్బులతో అన్నదానం చేపట్టిన గంగన్నను గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ పుండలిక్, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, గ్రామ కమిటీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

భైంసాటౌన్/కుంటాల/మామడ/లక్ష్మణచాంద/ఖానాపూర్/లోకేశ్వరం/నిర్మల్‌రూరల్/దస్తురాబాద్: జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ముక్కోటి ఏకాదశిని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్లను ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. భైంసాలోని పద్మావతి కాలనీలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే రామారావుపటేల్, భైంసా కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ ఎల్.శ్రీను, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మోహన్‌రావుపటేల్, ఇతర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు.

- కుంటాలలోని ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో అర్చకుడు శ్రీకాంత్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీనారాయణస్వామిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.
- కడెంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార పూజ, స్వామివారికి అభిషేకం చేశారు.
- మామడ మండలకేంద్రం, పొన్కల్, కొరిటికల్ గ్రామాల్లో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయాల్లో భక్తులు పూజలు చేశారు.
- లక్ష్మణచాంద మండలంలోని గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారా దర్శనం కల్పించారు. ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ సర్సారెడ్డి, నాయకులు అడ్వాల రమేశ్, సర్పంచులు ఉన్నారు. చామన్‌పెల్లిలో నిర్వహించిన పల్లకిసేవలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి పాల్గొన్నారు. రామాలయంలో పూజలు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.
- ఖానాపూర్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో పండితులు నర్సింహమూర్తి, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత భగవద్గీత గ్రంథాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, సభ్యులు ఉన్నారు.
- లోకేశ్వరం మండలం బాగాపూర్‌లోని రాజ్యలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజల్లో భక్తులు, పూజారి నరసింహాస్వామి పాల్గొన్నారు.
- నిర్మల్ రూరల్ మండలంలోని గ్రామాల్లోని ఆలయాలతోపాటు చిట్యాలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.
- దస్తురాబాద్ మండలంలోని గ్రామాల్లో పలుచోట్ల ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.



భైంసాటౌన్: ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులు



రేవోజిపేట సీతారామాంజనేయ ఆలయంలో..



లక్ష్మణచాంద: చామన్‌పెల్లి రామాలయంలో..



మామడ: పొన్కల్ వేంకటేశ్వర ఆలయంలో..



భైంసాటౌన్: దర్శించుకుంటున్న ఏఎస్పీ



కుంటాలలో..



పూజలో పాల్గొన్న మహిళలు



బాగాపూర్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో..



కడెం: రామాలయంలో..



భైంసాటౌన్: దర్శనానికి తరలివచ్చిన భక్తులు



ఖానాపూర్: విష్ణుసహస్రనామ పారాయణంలో



భైంసాటౌన్: జడ్జి డి. దేవేంద్రబాబు



ఖానాపూర్: పూజల్లో భక్తులు



లక్ష్మణచాందలో పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు



నిర్మల్‌రూరల్: చిట్యాల గ్రామంలో..

ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండలంలోని కన్కపూర్ సమీపంలోని బ్రహ్మేశ్వరాలయంలో శ్రీశ్రీశ్రీ సత్యానంద సరస్వతి స్వామిజీ 4వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీకి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి నది ఒడ్డున ఉన్న బ్రహ్మేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. వాస్తాపూర్ నుంచి బ్రహ్మేశ్వరాలయం వరకు తారురోడ్డు కోసం నిధులు మంజూరు చేస్తానన్నారు. తర్వాత రాయాపూర్‌కాండ్లీలో లక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో భైంసా మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, బీజేపీ నాయకులు శ్రీధర్, పోతన్న, గన్ను నర్సారెడ్డి, వెంకట్‌రెడ్డి, మంద భాస్కర్, మంద గణేశ్, అనిల్, సాహెందర్, సాయన్న, రజిత, భోజన్న, సునీల్, బద్దం గంగారెడ్డి, నరహరి పటేల్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతల స్వీకరణ



నారాయణ్‌రెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీ మాజీ చెర్మన్

లోకేశ్వరం: ఇన్‌చార్జి ఎంపీపీగా మామిడి నారాయణ్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ బాయమొల్ల లలిత నెలరోజులపాటు సెలవుల్లో వెళ్లారు. ఈ మేరకు లేఖను జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్‌కు అందించారు. వైస్ ఎంపీపీగా ఉన్న నారాయణ్‌రెడ్డికి ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు. బాధ్యతలు చేపట్టిన నారాయణ్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహకరిస్తానన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్, పీఏసీఎస్ చెర్మన్ రత్నాకర్‌రావు, నాయకులు సాయారెడ్డి, కపిల్, భుజంగ్‌రావు, భీంరావు, మాజీ సర్పంచ్ బోగ్గుట నర్సయ్య ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు.

క్రిస్మస్ సందడి!

- మార్కెట్‌లో స్టార్ బెలూన్స్, తదితర విక్రయాలు
- ముస్తాబవుతున్న చర్చిలు



భైంసాటౌన్: ఈనెల 25న ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ మేరకు జిల్లాలో మార్కెట్‌లో క్రిస్మస్ ట్రీ, స్టార్ బెలూన్స్, శాంటా తాత మాస్క్, ఇతర వస్తువులు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొనుగోళ్లతో షాపులన్నీ సందడిగా మారాయి. క్రైస్తవులు తమ ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకునేందుకు స్టార్ బెలూన్లు, క్రిస్మస్ ట్రీలను కొనుగోళ్లు చేస్తున్నారు. బేకరీల్లో నిర్వాహకులు వివిధ ఆకృతుల్లో కేకులు సిద్ధం చేశారు. అదేవిధంగా గాజుల్‌పేట్, కొండాపూర్, మాదాపూర్, వెంకటాపూర్‌తోపాటు పలు గ్రామాల్లో చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



ముస్తాబైన మాదాపూర్ చర్చి



విక్రయానికి సిద్ధంగా క్రిస్మస్ వస్తువులు

పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు

నిర్మల్‌టౌన్: పండుగల ద్వారా సంతోషం వెల్లివిరుస్తుందని, సోదరభావం పెరుగుతుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో గల ఆల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాల్గొన్న వాసవి వరల్డ్ స్కూల్ విద్యార్థులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో కేక్ కట్ చేశారు. చిన్నారులు శాంటాక్లాస్ వేషధారణలో అలరించారు. సెక్రటరీ జగదీశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజ, సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భైంసా–పంచగుడి వరకు బస్సు నడపాలి



భైంసా డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాయపూర్‌కాండ్లీ గ్రామస్తులు

లోకేశ్వరం: భైంసా నుంచి లోకేశ్వరం మండలంలోని పంచగుడి గ్రామం వరకు ఆర్టీసీ బస్సు నడపాలని రాయపూర్‌కాండ్లీ గ్రామస్తులు కోరారు. భైంసా డిపో మేనేజర్ అమృతకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ముందు రాయపూర్‌కాండ్లీ మీదుగా పంచగుడి వరకు బస్సు నడిపించారని పేర్కొన్నారు. మహిళలకు జీరో టికెట్ వల్ల బస్సు నడపటం లేదని తెలిపారు. పంచగుడి వరకు బస్సును నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లోకేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు జయసాగర్‌రావు, నాయకులు భూమన్న, రమేశ్, బద్దం గంగారెడ్డి, విలాస్, గంగారెడ్డి ఉన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: ప్రధానమంత్రి భారత్ వికసిత్ సంకల్ప్‌యాత్రలో భాగంగా బీర్నంది, కోలాంగూడ గ్రామాల్లో కేంద్ర పథకాలపై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. గరీబ్ కల్యాణ్, అంత్యోదయ, ఈజీఎస్, ఉజ్వల, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, తదితర పథకాలను ఎల్ఈడీ తెరపై వీడియో ప్రదర్శించారు. అనంతరం గ్రామస్తులకు పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఎనగందుల రవితోపాటు సోమశేఖర్, లోకిని జూని తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

లక్ష్మణచాంద/కుంటాల/ముధోల్/దిలావర్‌పూర్/దస్తురాబాద్: జాతీయ రైతు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మణచాంద లోని రైతు వేదికలో సర్పంచ్ ముత్యంరెడ్డి రైతులతో కలిసి కేక్‌కట్ చేశారు. ఏఈవో ఉమామహేశ్వరి, రైతులు పాల్గొన్నారు. కుంటాల మండలం కల్లూర్‌లోని వాసవి ఉన్నత, కుంటాల శాంతినికేతన్ పాఠశాలల విద్యార్థులు రైతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక అని పేర్కొన్నారు. ప్రిన్సిపాళ్లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, సంతోష్, డైరెక్టర్లు కదార్ల హరిప్రసాద్, జానకీరాం, బోగ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ముధోల్‌లోని అక్షరమోడల్ పాఠశాల, శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులు రైతుల వేషధారణలో అలరించారు. దిలావర్‌పూర్ మండలకేంద్రంలోని సిర్గాపూర్‌లో ప్లేర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రైతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. దస్తురాబాద్ మండలం గొడిసెర్యాలలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు మల్లేశ్, సుధాకర్, మునిందర్, ఉపాధ్యాయులు విజయ్, రాధిక, వెంకట్‌రాజం, రాజమణి ఉన్నారు.



దిలావర్‌పూర్: రైతుల వేషధారణలో చిన్నారులు

చెరువు శిఖం భూముల పరిశీలన

సారంగాపూర్: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని జామ్ మోర్‌చెరువును మండల సర్వేయర్ ప్రశాంత్, స్వర్ణ ప్రాజెక్టు ఏఈ మధుపాల్ శనివారం పరిశీలించారు. గత సోమవారం మత్స్యకారులు చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని పరిరక్షించాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఈనేపథ్యంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వేయర్, ఏఈ ఆ భూములను పరిశీలించారు. సర్వేయర్ ప్రశాంత్ మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజుల్లో శిఖం భూములు సర్వేచేసి ఎంతమేర భూమి ఆక్రమణకు గురైందో తెలియజేస్తామని అన్నారు. దీంతోపాటు వెంటనే చెరువు భూముల కొలతల అనంతరం హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.



పరిశీలిస్తున్న సర్వేయర్, ఏఈ

కూలీలకు వందరోజుల పని కల్పిస్తాం

లక్ష్మణచాంద: మండలంలో ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కూలీకి వందరోజుల పని కల్పిస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. 2024–25 సంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనుల ఎంపికపై మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఏ ఏయే పనులు చేపట్టాలో గ్రామస్తుల నుంచి ఆయన వివరాలు సేకరించారు. సర్పంచ్ హైమావతి, క్షేత్రసహాయకులు శ్రీనివాస్, వీడీసీ సభ్యులు రాజు, చిన్నారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రైతుల ఆందోళన

కడెం: మండలంలోని కన్నాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. 2.5 కిలోల అదనపు తూకం, పైరవీదారుల రైతుల ధాన్యమే తూకం వేస్తున్నారని ఆరోపించారు. చిన్న రైతుల ధాన్యం తూకం వేయడంలో నిర్వాహకుడు నితిన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెంబి: 18 ఏళ్లునిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని నిర్మల్ ఆర్డీవో రత్న కల్యాణి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు, మార్పులు చేర్పులపై 6, 7, 8 ఫారాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్లు లేని వారు బీఎల్‌వోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐలు శ్రావణ్‌రెడ్డి, చక్రగ్నీ, సీనియర్ అసిస్టెంట్ రాజం ఉన్నారు.

మండల సమావేశం

మామడ: వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్రం అమలు చేస్తున్న పీవీటీజీ పథకంలో భాగంగా మండలంలోని తోటిగూడ ఎంపికైంది. ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో శనివారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. తోటిగూడలో చేపట్టే అభివృద్ధి పనులు, పీఎం జన్‌మన్ కార్యక్రమం అమలుపై చర్చించారు. ఎంపీడీవో రమేశ్, తహసీల్దార్ సర్వరాజ్, ఎంపీవో గోవర్దన్ ఉన్నారు.

క్రైస్తవులకు దుస్తుల పంపిణీ

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో తహసీల్దార్ అతికొద్దీన్ శనివారం క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్మస్ పురస్కరించుకొని ప్రభుత్వం అందించిన దుస్తులను గ్రామాల్లోని వెయ్యిమంది క్రైస్తవులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో సురేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

న్యాప్‌కిన్లు అందజేత

కడెం: కడెం, అంబారిపేట్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు బీఆర్‌ఎస్వీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు నరేశ్ శనివారం న్యాప్‌కిన్లు అందజేశారు. జెడ్పీ కోఆప్షన్ మెంబర్ రఫీక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటరమణ ఉన్నారు.